# దేవుడు త్యాగం చేశాడు!

అరుణ



అలవైకుంఠపురములో నగరిలో నామూల సౌధంబుదాపల మందారవనాంత రామృత సరః ప్రాంతేందుకాంతో పలోల్పర పర్యంక రమావినోదియగు నాపన్న ప్రసన్నుండు - ఒక్కసారి మెడలో హారం చూసుకుని ఉలిక్కిపడ్డాడు.

లక్ష్మీదేవి ఆయన ఉలికిపాటు చూసి ఫక్కున నవ్వింది.

ఆయన ఉలికిపడటానికి కారణం లేక పోలేదు. భూలోకంలో భరతఖండంలో ఆంధ్రదేశంలో ఒకానొక ఊళ్లో ఈమధ్యనే కొంతమంది భక్తులు పునరుద్ధరించిన ఆయన ఆలయం వున్నది. ఆ దేవాలయంలోని విగ్రహం మెడలో ఒక బంగారపు గొలుసు వుంది. ఆయనకున్న ఆస్తి ఆ ఒక్కగొలుసే! ఆ గొలుసుమీదనే దొంగవీరడి కన్నుపడింది. నిజానికి పడ్డది వీరన్నకన్ను కాదు, సెంద్రి కన్ను. పదిరోజులక్రితం దేవుని తిరునాళ్ళు జరిగినాయి. ఆ తిరునాళ్ళలో ఎక్కడైనా ఓ బరువైన జేబు కోసరం వీరడు తిరుగుతున్నాడు. వీరడికోసరం సెంద్రి తిరుగుతున్నది. వీరడికి సెంద్రి తారసపడలేదుగాని యాదృచ్ఛికంగా ఇద్దరి కళ్లు ఆ గొలుసుమీద పడినయి.

ఆరాత్రి—

"మాఁవా!" అంది గోముగా సెంద్రి.

జేబు దొరకలేదని నిరుత్సాహపడిపోతున్నాడు వీరడు.

ఆ పిలుపుకి సగం కరిగిపోయాడు.

"ఏటి?" అన్నాడు మగతగా-

"ఆ గొలుసు శానా బాగుంది మాఁవా!" అంది గోముగా. వీరడు ఉత్సాహంగా లేచి కూర్చున్నాడు.

"ఏ గొలుసు?"

"అదే, ఆ యిగ్రహం మెడలో లేదూ? ఎండలో ఏం మెరిసిపోద్దిలే! మాఁవా—"

మాఁవ ఇక ఈ లోకంలో లేడు.

"మనకి దేవుడేటి దెయ్యమేటి? అయినా యిగ్రహమేటి సేత్తది మాఁవా! నాకా గొలుసుమీద మనసైంది. తేబోతే—"

తరువాత మాట పూర్తికానీలేదు వీరడు.

"నీ కేటి తేలేదు? అమాసరాత్తిరి సూస్కో—".

సెంద్రి మురిసిపోయింది.

"మాఁవా! నిజంగానా?"

"నిజఁవే, నీతోడు. ఆ రేత్తిరిసరే ఈ రేత్తిరికి—"

* * *

వీరడు కళ్ళు నులుముకుని దృష్టిసారించి చీకట్లో చూశాడు.

చీకటి మాయలా అలుముకుంది.

వీరడు ధైర్యంచేసి గుడితలుపు తాళం పట్టుకున్నాడు. జేబులోంచి ఇనుపపనిముట్లు తీసి తాళం తీయటాని కుపక్రమించాడు. పదినిముషాలు తంటాలుపడ్డాక తాళం ఊడి వచ్చింది. వీరడు దడదడలాడుతున్న గుండెని చిక్కబట్టుకుని, తలుపుగడియ తీశాడు. తలుపుతీసి లోపలి వెలుగురాకుండా ఒక్కగంతులో లోపలికి వెళ్ళి తలుపుమూశాడు.

దేవుడు నవ్వుతున్నాడు. ఎందుకు? దేవుని విగ్రహంముందు దీపారాధన జ్ఞాన జ్యోతిలా ప్రకాశిస్తున్నది.

వీరడు ధైర్యంగా రెండడుగులువేసి విగ్రహంకేసి చూశాడు. ఆయన కెంత ధైర్యం. దొంగవచ్చినా అరవలేదు. మెదలకుండా రాయిలా నిల్చున్నాడు. దొంగనిచూసి భయంతో కొయ్యబారిపోయినాడేమో!

వీరడు భయాన్ని పక్కకునెట్టాడు. సెంద్రిని తలుచుకున్నాడు. ఒక్కసారి గొలుసుతీసి జేబులో వేసుకున్నాడు. దేవుడు వద్దనలేదు. తప్పని హెచ్చరించలేదు.

నవ్వుతూ చూస్తూ నిలుచున్నాడు. వీరడు తలుపుతీసి బయటకు వచ్చాడు. పాపంలా పేరుకున్న చీకటిలోంచి తన గుడిసెవైపుగా పరుగుపెట్టాడు.

* * *

"తలుపు తీ__''

"యాపొద్దనగా పోయినావు? కూడు తినకుండా యాడ తిరుగుతుండావు? రా కూడు తిని తొంగో__'' అంది కనకం. వీరడు ఒకసారి తలుపు తెరుచుకుని బయటకు వెళ్ళి ఎవరైనా వస్తున్నారేమోనని చూసి వచ్చాడు. ఎవరూ లేరు. అతనికి ధైర్యం వచ్చింది.

"కూడు తినవా? ఎన్ని ముంతలు లాగినావు?" వీరడు నోరెత్తలేదు. గుడిసెలో ఓ మూలగావున్న కుండతీసి దానికింద జేబులోని గొలుసుతీసి దాచాడు. దొంగతనం చేసిన వస్తువు అక్కడే దాస్తాడు.

''ఏందది? ఏడ కన్నంవేసి సచ్చావు?''

"ఛస్, దిక్కుమాలినదానా! ఎందుకట్టా వాగుతావు? గోడలకి సెవులుంటయి! నరిసిగాడు యిన్నాడంటే సచ్చానే! ఆ దెన్నాళ్ళనుంచో దీనిమీద కన్నేసిండు."

కనకం ఊరుకోలేదు. గొలుసు తీయనే తీసింది.

''ఓరింటో దిది?''

"యాడదోలే. నీకేటి? పద, కూడెట్టు."

"ముందు సెప్పితీరాల.''

వీరడు మంచంమీద విలాసంగా కూర్చుని చుట్ట వెలిగించాడు.

"ఎట్టుంది?'' అన్నాడు తన ప్రజ్ఞకు తనే మురిసిపోతూ.

"ఇది ఆ దేవుడిది కాదుగందా? అట్టనే వుందే.''

వీరడి మీసాలచాటున నవ్వుతొంగిచూసింది.

"ఏమయితే?"

కనకం గుండె ఆగిపోయింది. ఆషళంగా మంచం పక్కన కూలిపోయింది.

"ఏందే, అట్టా బయపడతావు?"

కనకం సర్వాంగాలు కంపించిపోతున్నాయి. నోట మాట రావటంలేదు.

"సీ, పిరికిముండ."

వీరడు లేచి చిప్ప తెచ్చుకుని నులక కుక్కిలో కూర్చుని కూడుతినటం మొదలుపెట్టాడు.

కనకం మేధ ఇప్పటికి పనిచేయటం ప్రారంభించింది.

"ఓరి నాయనోయ్, నా కొంప దీసినావురా సచ్చినోడా!" అని అరిచింది.

వీరడి కళ్ళు ఎర్రబడ్డాయి.

"ఏందే వాగుడు. నోరుముయ్యి."

"దేవుడి గొలుసు దొంగతనం సేత్తే దేవు డూరుకుంటాడా? ఇదేం బుద్ధిరా నీకు? ఎల్లి ఆడ పెట్టిరా."

వీరడు విరగబడి నవ్వాడు.

"ఓసి ఎర్రిమొగమా__"

"ఎర్రిమొగమె మంచి మొగమె. నా మాటిను."

"ఏం దినేది? ఏడిసినావులే. ముంతేది? నే పోవాల."

"యాడకి?" అదురుతూ అడిగింది.

"యాడకేంది? మగోడన్నాక లచ్చ పనులు. ఎట్టనో తిరుగుతాడు. నాలుగురాళ్ళ తెత్తాడు. పెతిదీ నీకు సెప్పాలా యేంది?"

"యాందయ్యా! నా కేటో బయంగా వుంది. ఏమన్నా అవుతే?"

"ఇదిగో ఊరికే బయపడమాక. ఏందయ్యేది! నే నెన్నాల్లనుంచి సెయ్యటం లేదూ? యాపొద్దైనా దొరికానా?'' అన్నాడు కూడుతిన్న చిప్ప మూలకి గిరాపెట్టి.

"నీకు తెలవదు. దేవుడి కోపం వత్తే కటినంగా సిచ్చ ఏత్తాడు.'' అంది వణికిపోతూ.

"ఛీ, ఎదవముండా, ఏడే దేముడు? యాడుంటాడు? దేవుడి కోపం వాత్తే ఏటి సేత్తాదోగాని, నా కోపం వాత్తే బతకనీను. సచ్చినట్టుండు.''

కనకం కళ్ళవెంబడి వర్షం కురుస్తున్నది.

"వొద్దు. ఇదీ ఓ బతుకేనా? మనకేమన్నా మరియాదుందా పెపంచకంలో? నిన్ను సూసి అందరూ అసయ్యంతో వూస్తా వుంటే ఎట్టా బాగుంది నీకు? ఎంకాయిని దొంగ కొడుకని పిలుత్తారు. అట్టా పిలుత్తా వుంటే నా గుండెల్లో పొడిసినట్టుంటది. కూలి నాలి సేసుకుని బతకొచ్చు. ఎంకడు రిచ్చాబండి యేసుకు బతకటం నేదూ? నా మాటిను. నువ్వూ ఓ బండేసుకో__"

కనకం పూర్తిచేయనేలేదు. చెంప ఛెళ్ళమంది. వీరడు కోపంతో బుసలు కొడుతున్నాడు. అది వాడి కోపానికి పరాకాష్ఠ.

"ఓడే అది _ నా కొడుకుని అనేది. చీలుత్తా. ఏటనుకున్నాదో వీరిగాడంటే__"

కనకం నోరెత్తలేదు. ఏమన్నా అంటే మరిన్ని దెబ్బలు తగులుతాయి. అయినా వీరిగాడికి చెప్పి ప్రయోజనం లేదు. వాడు దొంగతనం చేసివచ్చిన రోజు ఈ సన్నివేశం వుంటునే వుంటుంది. దెబ్బలు తింటూనే వుంటుంది.

"బుద్దొచ్చిందా? నో రెత్తకు."

కనకం వెక్కివెక్కి ఏడుస్తూ కంది పోయిన చెంపని రాసుకుంటూ కూర్చుంది.

"ఓరన్నా వొత్తే నాకేటి తెలవదని సెప్పు. నే నట్టా పోయొత్తా__"

కనకం ఆదుర్దాగా వీరడ్ని చూసి అడ్డంగా వెళ్ళింది.

"యాడకి పోతావు? అమాసనీకటి. తొంగో."

"ఈ యీరడు సీకటికి దేముడికి బయపడే రకంకాదు. లే, అడ్డం __ దాన్ని సూసి రావాల'' అన్నాడు.

కనకం చేతిలోని గొలుసు ఒక్కసారి గుంజి మొలలో దోపుకున్నాడు.

''సెంద్రి కోసమేనా?''

"ఊఁ!"

కనకం వాడి ముఖంలోకి చూసి "ఒద్దు ఎల్లొద్దు. ఆడొచ్చిండు" అంది భయంగా.

"ఓడు?"

"సెంద్రిగాడు."

వీరడు గుడిసె ఎగిరి పోయేటట్లు నవ్వాడు.



"ఇంకెక్కడి సెంద్రిగాడు. ఆడికి పదేళ్ళ సిచ్చపడింది. జైల్లో సత్తున్నాడు. అయినా వత్తే నాకేటి బయం."

"మరేమొ, నరిసిగాడి పెళ్లాం సెప్పింది."

"ఆడిమీద కన్నేసిందా ?" అన్నాడు. గుంజకున్న అద్దంలో చూస్తూ మీసాలు సరి చేసుకున్నాడు. వేళ్ళతోనే తల దువ్వుకున్నాడు.

"నా మాటిను. ఇయ్యాలైనా తొంగో. నాకేటో బయం బయంగా వుంది."

వీరడి కోపం రెచ్చిపోయింది. కనకం రెక్కపట్టి ఒక్క లాగు లాగాడు. కనకం పోయి నులకమంచంలో పడింది.


"సిలకా, తెల్లారేదాంకా తొంగో."

తడిక తలుపు కాలుతో లాగి విసురుగా అజ్ఞానంలాంటి చీకటిలో కలిసిపోయినాడు, వీరడు.

*    *    *

మరీ హుషారుగా వున్నప్పుడు వీరడు ఈలేస్తాడు. ఇప్పుడు వేశాడు. వాడి ఉత్సాహానికి అంతులేదు. ఎంత ఆనందంగా వుండాలో అంత ఆనందంగానూ వుంది. ఈ గొలుసు చూసి సెంద్రి ఏమిస్తుందో ? ఆ సెంద్రిగాడు జైలుకు పోవటం తనకు మంచిదైంది. సెంద్రి తనదైంది. ఒకవేళ సెంద్రిగాడు వచ్చి వుంటే ? వస్తే ఏం ? నాలుగు తంతే వాడే నోరెత్తడు.

వీరడు ఉత్సాహంగా చీకటిని చీల్చుకుని పోతున్నాడు. వాడి కాళ్ళు అప్పుడప్పుడు తడబడుతున్నా త్వరత్వరగా నడుస్తున్నాయి.




అంతలో—

అజ్ఞానంలాంటి చీకటిని చీల్చుకుని ఏదో పిలుపు. ఆ స్వరం అస్పష్టంగా వుంది.

వీరడు తటాలున ఆగిపోయాడు. చెవులు రిక్కించుకుని విన్నాడు. ఎవరిదో పిలుపు దీనంగా వుంది. జాలిగా పిలుస్తున్నారు.

వీరడు అప్రయత్నంగా ఆ పిలుపు వచ్చిన వైపుగా నడక సాగించాడు. ఆ పిలుపు దగ్గరౌతున్న కొద్దీస్పష్టమౌతున్నది. అది పిలుపు కాదు. ఏడుపు.

వీరడు ఒక్క క్షణం ఆగి చుట్టూ చూశాడు. ఎదురుగా వున్న గుడిసెలోంచి వస్తోంది ఏడుపు. ఎవరది? ఎందుకేడుస్తున్నారు?

వీరడు తడిక తలుపు తోసి లోపలికి వెళ్ళాడు. వాడు చూసిన దృశ్యం విషాదకరమైనది.

గుడిసెలో కిరసనాయిలు బుడ్డి వెలుగుతున్నది. ఆ గుడ్డి వెలుగులో—ఒక మూల మంచం—ఆ మంచంమీద ఒక పిల్లవాడు నిద్ర పోతున్నాడు. ఆ కుక్కి మంచంమీద తలపెట్టి ఒక స్త్రీ రోదిస్తున్నది. ఆమె నల్లని కేశాలు చెదిరిపోయినయి. ఆ కేశాల చివర్ల నుంచి కన్నీరు బొట్లుబొట్లుగా పడుతున్నది.

వీరడి రాకను ఆమె గమనించలేదు. ఎందుకంత దుఃఖం?

"యిదిగో, నిన్నే! ఎందుకట్టా ఏడుత్తా?"

ఆమె మెల్లగా తలెత్తి చూసింది. వీరడి ఆకారాన్ని చూడగానే ఆమె పైప్రాణాలు పైనేపోయాయి. చెదురుతున్న చూపులతో వాణ్ణి చూస్తూ నిల్చుంది.

ఆమె తనని చూసి భయపడుతున్నదని గ్రహించాడు వీరడు.

"ఏం బయపడమాక. నేనేం సేసేవోణ్ణి కాదులే. ఎందు కేడుత్తా?"

ఆమె కళ్ళు దించుకుంది.

"సెప్పవ్?"

"ఏంది సెప్పనన్నా! సిన్నిగాడు మూసిన కన్ను తెరవటంలేదు. ఒల్లు సూత్తే మండి పోతావుంది. ఏటి సెయ్యను? ఆ దేముడే నన్ను రచ్చించాల."

"కొడుకా ఏంది?"

ఆమె ఏడుస్తూనే తలూపింది.

"కొడుకే. ఒక్కడంటే ఒక్కడే. ఈ పెపంచకంలో నాకున్నది ఆ ఒక్కడే. ఓరునేరు. ఆడ్ని సూసుకుని బతుకుతున్నా."

ఆమెకు దుఃఖం ఆగటంలేదు. ఆశగా కొడుకు వంటిమీద చెయ్యివేసి చూసింది.

"ఓరి దేవుడోయ్, ఒల్లు కాలిపోతన్నది. నా కింకేటి దిక్కు" అంటూ శోకాలు ప్రారంభించింది.

వీరడు కంగారుగా ముందుకు వొంగి వాడి ఒళ్ళు చూశాడు. జ్వరం బాగా వుంది.

"ఎన్నాల్లనుంచి జొరం?"

"ఇయ్యాల్టికి అయిదుదినాలు. మాపటేల నుంచి మాటాపలుకూ నేదు. నా కేటో బయంగా వుంది."

వీరడు ఆమెవంక చూడలేకపోయాడు. ఆమె ముఖంలో దైన్యం గూడుకట్టుకుంది.

"ఆసుపత్తిరికి తీసుకుపోలా?"

ఆమె ముఖం రెండుచేతులలో దాచుకుని బావురుమంది.

"ఎట్టాగన్నా, మొదటిరోజు అదేపోద్దిలే అని కూకున్నా. తగ్గలే. ఎక్కువైంది. మొన్న డాట్టరుబాబు కాడికెల్తే డబ్బిత్తేగాని మందివ్వనన్నాడు. ఏడతేను? సరింగా తిన టానికే నేదు."

ఆమె మాటలు ఏడుస్తున్నాయి. ఆ కన్నీటి వేడికి వాడి రాతిహృదయంలో కదలిక ప్రారంభమైంది.

వీరడి హృదయంలో ఏ మూలనో ఎవరో గ్రుచ్చినట్లయింది. జేబులో గొలుసు దేహానికి గ్రుచ్చుకుంది.

"నీ మొగుడు నేడూ?"

ఈ ప్రశ్నతో ఆమె దుఃఖం కట్టలు తెచ్చుకుంది. బాణం దెబ్బతిన్న పక్షిలా అయింది.

"ఆడుంటే ఇంకేటినేదు. ఆడికి నాను పనికిరాలా. నన్నొగ్గేసిపోనాడు. ఈడ్ని సూసుకుంటా బతుకుతున్నా. ఓరి సిన్నీ — నువ్వు బతకవురా నాయనా!" వీరడిమనస్సు అదోలా అయింది.

ఆమెవంక చూడలేక తలతిప్పుకున్నాడు. వాడి గుండెల్లో ఆమె కన్నీళ్ళు చెరువులై పారుతున్నాయి.

"ఊకో, అట్టా ఏడవమాక."

ఆమెనెట్లా ఓదార్చాలో తెలీలేదు.

"ఏడవకేటి సేసేది? నా కింకెవరు దిక్కు? ఆ దేముడికికూడాదయలేదుగందా?" అంది ఏడుస్తూ.

"దేముడికి దయనేకపోతే మడుసులకి నేదూ ! నువ్వూరుకో. నేను లగెత్తి కెల్లి డాట్టరుని తెత్తా.''

ఆమె ముఖం నీళ్ళతోతడిసి చీకిపోయిన కాగితంలా వుంది. వీరడి మాటతో ఆమెకు ధైర్యం కలిగింది.

''అన్నా'' అంది ఆశగా.

వీరడు చీకట్లో పరుగెత్తి వెళ్ళిపోయాడు. ఆ పరుగు పరుగు డాక్టరు శ్రీనివాస రంగా రావు ఇంటిదగ్గర ఆగాడు.

"డాట్టరుబాబూ.''

శ్రీనివాస రంగారావు ప్రళయంవచ్చినా ఇంత రాత్రప్పుడు నిద్రలేవడు. కాని వీరడు తలుపు విరుగుతుందేమో నన్నంతగా బాదు తున్నాడు. లేవకపోతే పోయేటట్లు లేదు.

డాక్టరు బద్ధకంగా లేచి తలుపు తీశాడు. వీరడ్ని చూసేసరికి డాక్టరు కొయ్యబారి పోయాడు. భయంతో నోటమాట రాలేదు.

వీరడిదేమీ గ్రహించలేదు. పరిగెత్తి వచ్చాడేమో ఆయాసంతో రొప్పుతున్నాడు. నల్లని వాడి ముఖం మరింత మలినమై భయంకరంగా వుంది.

"ఎవరు నువ్వు ?'' డాక్టరు ఇప్పటికి తేరుకున్నాడు.


"డాట్టరు బాబూ, మీ రు న్న పా ళా న రావాల," అన్నాడు.

"ఎక్కడికి ? ఎందుకు ?''

''ఓ బిడ్డ శానా పెమాదస్థితిలో వున్నది. రావాల."

డాక్టరు ఒకసారి వీరడ్ని చూసి "ఈ చీకట్లో చలిలో ఏమిటి ? రేపు డిస్పెన్సరికి తీసుకురా," అన్నాడు.

"కాదు బాబూ. ఆడికి అయిదు దినాలమట్టీ జొరం. ఒళ్ళు కా లి పో తా వుంది. ఏటి సెయ్యాలో తోచటంనేదు. పాపం, ఆ తల్లికి ఓరు నా అన్నవోళ్ళు నేరు. ఒక్కడే కొడుకు. ఆడిమీనే పంచపేణాలు పెట్టుక బతుకుతా వుంది. మీ ర్రావాల. త చ్చ న ం ఆడ్ని సూడాల.''




వీరడు డాక్టరు రెండు చేతులు పట్టు కున్నాడు.

''అంటే ఎవరో బీదదన్న మాట—"

"అవును డాట్టరు బాబూ. యాదో కూలి నాలి సేసుకు బతుకుతుంది. పేమ అందరికి ఒకటేగందా. ఆ కొడుకు నేకపోతే ఆ తల్లి బతకదు. బాబు, మాటలుకాదు. రండి—"

''నాన్సెన్స్. ఇంత రాత్రిపూట ఎవరో దిక్కుమాలిన స్త్రీ కొడుకుని చూ డ టా ని కి రావాలా ? పైగా ఫీజుకూడా లేకుండా. అయామ్‌సారీ. నాకంత ఓర్పు లేదు. వేరే డాక్టరు దగ్గరకిపో. ఇందుకా వచ్చి నిక్షేప మంటి నిద్ర పాడుచేశావ్ ?''

డాక్టరు ఆలస్యం చేస్తున్నకొద్దీ వీరడి ఆవేదన ఎక్కువవుతున్నది.

"అదేటి బాబుగారూ. ఆ అ మ్మా యి అ ట్టా ం టి ది కా దు . ఇయ్యాల కాపోయినా రేపైనా కూలినాలి సేసి మీ రునం తీర్సు కుంటది.''

డాక్టరు ముఖం చిట్లించాడు.

''దానికి నీకు ఏమిటి సంబంధం ?''

ఈ మాటతో వీరడికి కోపం అసహ్యం రెండూ కలిగాయి. వాడికి ఎంతోమంది స్త్రీలతో అక్రమ సంబంధం వున్నమాట నిజమే ! కాని ఈమెతో అలాంటి సంబం ధాన్ని కనీసం కలలోకూడ ఊహించలేదు. ఆమె ఎవరో వాడికి తెలీదు. కాని ఆపదలో వుండి ''అన్నా'' అని పిలిచింది. ఈ పిలుపు వాడి మానవత్వపు లోతుల్ని పరిశోధించింది. కనకం కన్నీళ్ళు వాడిని మార్చలేదు. కాని ఆమె కన్నీళ్ళు వాడిలో వింత మార్పును తెచ్చినాయి. వాడికి తెలీకుండానే వాడు మనిషయినాడు.

''అదేటి బాబుగారూ! ఆడకూతురు ఆప దలో వుంటే కూసింత సగాయం సెయ్య టానికి. మడిసికి మడిసికి సం బం ధ ం ఉండాల్నా ? మీరు సదుకున్నోళ్ళు. తొరగా రండి. ఆ బిడ్డ పేనం కాపాడండి. ఆ తల్లి తల్లడిల్లి పో తా వు ం ది. మీ కాళ్లంటు కుంటాను.''

వీరడి కళ్ళవెంబడి అశ్రుపుష్పాలు డాక్టరు పాదాలమీద పడినయి.

శ్రుతిమించి రాగానపడుతుందని గ్రహిం చాడు డాక్టరు. వీరడికిది కొత్తగాని డాక్టరు కివి అలవాటే.

"ఏమిటీ న్యూసెన్స్. వెళ్ళి ఎవరినైనా పిలుచుకో. ఈ రాత్రివేళ లేపటమేకాకుండా పైగా ఏ గుడిసెలోకో రావాలిట. రోజూ కొన్ని వేలమంది చస్తున్నారు. అలా అందర్ని చూస్తూకూర్చుంటే మనం బ్రత కలేం—''

ఈ చివరిమాటతో వీరడు ఉలిక్కిపడ్డాడు. వాడికి దిక్కుతోచలేదు. వాడి కళ్ళలో ఆఖరిశ్వాసను పీలుస్తున్న సిన్నిగాడు కనపడ్డాడు. వాడి హృదయాన్ని చీల్చుకుని కన్నీరువచ్చింది. ఆ కన్నీరు వాడి మానవత్వాన్ని మేల్కొలిపి పరిశుద్ధం చేసింది. వాడికళ్ళలో సెంద్రి అందంగా నవ్వి పిలిచింది. వీరడు ఒక్కసారి కళ్ళు మూసుకున్నాడు. వాడిహృదయం బరువెక్కింది.

''డాట్టరుబాబూ! డబ్బియ్యనేదనేగా మీరు రాంది. నేనిత్తాను. వత్తారా?''

డాక్టరు ఆశ్చర్యంగా చూశాడు.

"నువ్విస్తావా ?"

వీరడు ఆవేశంగా జేబులోంచి బంగారపు గొలుసు తీశాడు.

''డాట్టరుబాబూ! సత్తెపెమాణంగా చెబుతున్నాను. నేను దొంగని. ఇది దొంగ సొమ్మే. ఓరిదని అడక్కండి. ఇదమ్మితే బోల్డుడబ్బువత్తది. మీకు బయమైతే నేనే ఆ పనిసేసి డబ్బిత్తాను. ఇది మీకాడ ఉంచుకోండి. ఇక రండి."

డాక్టరు దిమ్మెరబోయాడు. క్షణంసేపు అచేతనంగా నిలబడిపోయాడు.

"డాట్టరుబాబూ! ఆలీసెం సెయ్యద్దు."

డాక్టరు ఈ లోకంలోకి వచ్చాడు. ఆశగా ఆనందంగా గొలుసువంక చూశాడు.

"ఇలాంటి గొలుసే మా అమ్మాయికి చేయిద్దామనుకుంటున్నాను" అని గొలుసుని గట్టిగా పట్టుకుని ఇనుప బీరువాలో పెట్టి వచ్చాడు.

పదినిమిషాలలో గుడిసె చేరుకున్నారు.

"ఏంలేదు. మామూలు జ్వరమే. రేపు ఉదయానికల్లా తగ్గిపోతుంది" అన్నాడు సిరంజి వేడి నీళ్ళలో శుభ్రంచేస్తూ.

వీరడి ముఖం వికసించింది.

ఆమె కొడుకు జుట్టు నిమురుతూ డాక్టరు వంక, వీరడి వంక చూసింది. ఆమె కన్నీళ్లు కృతజ్ఞతతో మెరిసిపోతున్నాయి.

"ఏం బయం నేదుగందా ?" అన్నాడు వీరడు.

"ఏంలేదు. మళ్ళీ రేపొచ్చి చూస్తాను. ఈ మాత్రలు వేయండి."

వీరడు తలూపి మాత్రల పొట్లం తీసుకున్నాడు.

"ఇంక నేను వస్తాను."

"శానా మంచోళ్లు డాట్టరుబాబు" అన్నాడు వీరడు.

డాక్టరు వెళ్ళిపోయాడు.

ఇంతసేపు ఆమె తన ఆవేశాన్ని ఆపుకుంది. డాక్టరు వెళ్ళిపోయాక "అన్నా" అంటూ వచ్చి పాదాలమీద పడింది. ఆమె కన్నీళ్ళు అతని పాదాలని కడుగుతున్నాయి.

"నువ్వు మడిసివికావు, దేముడివి. నేకపోతే ఇంత అద్దరేత్తిరి నాకోసమని ఏడనుంచో ఎట్టావత్తావు ? నా మొరయిని పరుగెత్తికొచ్చిన బగమంతుడివి."

వీరడు ఆమె ముఖంలో వెలుగుతున్న తృప్తినిచూసి నవ్వాడు.

"బగమంతుడేటి ? నాకయ్యన్నీ తెలవ్వు. నేను మడిసినే. ఆఁ!" అన్నాడు.

* * *

"అమ్మయ్యో ! దొంగలుపడ్డారు. గుడిలో దొంగతనం చేశారు."

"ఇంకేమన్నా వుందా ?"

''దేవుడూరుకుంటాడా ? ఈ ఊరికేదో కీడు మూడింది."

"ఈ దేవుడెంత సత్యవంతుడు. ఆ దొంగతనం చేసిందెవరో, వాడి తల మూడు ముక్కలు చేయడూ ?''

ఊరు ఊరంతా ఉడికిపోయింది.

కనకం గుండెలు అవిసిపోయాయి.

మనసులోనే ''ఆడొట్టి పిచ్చోడు. ఏటి తెలవదు. ఆడు సేసింది తప్పే. చమించు సామీ" అని లెంపలువేసుకుని ఏడ్చింది.

దేవుడు వీరన్నని ఏమీ చేయలేదు. గుడిలో బోసిపోతున్న మెడతో నవ్వుతు చూస్తూ నిల్చున్నాడు.

వారం గడిచింది. వీరన్నకి అహం పెరిగింది. ''సామిరంగా, నా తడాఖా సూసి అడిలిపోయిండు నీ దేవుడు" అన్నాడు కనకంతో మీసాలు మెలేస్తూ.

వీరన్నని చూసి దేవుడు నవ్వుకున్నాడు. ఆయన నవ్వుచూసి లక్ష్మీదేవి ''చాల్లెండి మీ నాటకం. మిమ్మల్ని నమ్మిన ఆ బీదరాలి కొడుకుకోసరం మీకున్న ఆ ఒక్క బంగారపు గొలుసు త్యాగం చేశారని ఆ పిచ్చివాడికేంతెలుసు ? మీరే వాడ్ని సాధనంగా వాడుకున్నారుగా. పాపం, వాడు అదంతా తన విజయమనుకుంటున్నాడు" అన్నది.

ఆయన నవ్వుతూ లక్ష్మీదేవి బుగ్గమీద చిటికేసి వెనక్కివాలి దీర్ఘంగా నిట్టూర్చాడు